# కథలా? కథకులా!!

లేత తమలపాకును చూడగానే నమలబుద్ధి వేస్తుంది. నమిలినకొద్దీ ఆనందం అదో రసానుభూతి కలుగుతుంది.

శచీంద్రుడి రచనలు లేత తమలపాకులవంటివి

ప్రకృతిని చూసి పరవశించినా, సమాజాన్ని చూసి ఆవేశం చెందినా ఆయన నోట అద్భుతమైన కవిత్వం పలికేది. ఆ కవిత్వం నలుగురి నోటా లేత తమలపాకులా నలిగేది.

శచీంద్రుడి కథలు, కవితలు అచిరకాలంలోనే అతడికి అపారమైన ఖ్యాతి నార్జించి పెట్టాయి. తన రచనలు ప్రపంచం నలుమూలలా చేరాలని శచీంద్రుడు వాటిని ఆంగ్లంలోకి తర్జుమాచేయ నారంభించాడు. సంవత్సర కాలంలోనే శచీంద్రుడంటే ఏమిటో ప్రపంచానికి తెలిసింది. ఎందరో విదేశీ ప్రచురణకర్తలు ఆయన రచనల కోసం ఎగబడసాగారు.

అయితే కోట్లాది పాఠకుల దురదృష్టం మృత్యు రూపంలో శచీంద్రుణ్ణి మింగి వేసింది. అప్పుడాయన వయసు నలుబదిరెండు సంవత్సరములు మాత్రం!

శచీంద్రుడి అకాల మరణానికి ప్రపంచమంతా ఏక కంఠంతో విలపించింది.

ఇప్పటికి శచీంద్రుడు మరణించి పదిసంవత్సరాలవుతుంది. కానీ ఇప్పటికి ప్రతి సంవత్సరం ఆయన జన్మదినం నాడు ఎన్నో పత్రికలు సంస్మరణ సంచికలు వేసి ఆయన రచనలను మళ్ళీ కొత్త పాఠకులకు పరిచయం చేయటం సంప్రదాయంగా ఉంటోంది. కానీ ఒక సంవత్సరం ఈ విషయమై చిన్న సంచలనం రేగింది.


ఒక పత్రిక అంతవరకూ ప్రచురితంకాని శచీంద్రుడి రచనలను శోధించి ప్రచురించాలని సంకల్పించి- ఆయన వాళ్ళ దగ్గర్నుంచి అపరిచితులవరకూ విన్నపాలు పంపింది. ఆ ప్రయత్నంలో శచీంద్రుడి అముద్రిత రచనలు అనేకము వారికి లభించాయి. వాటిని ప్రచురించగా వాటిలో ఓ కథకు అద్భుతమైన ప్రాచుర్యం కలిగింది.

కథ పేరు రక్తం!

ప్రతి మనిషిలోనూ ఒకే రక్తం ప్రవహిస్తోంది. కానీ మనిషి చర్మపు రంగుకు ప్రాధాన్యతనిస్తున్నాడు. ప్రతి మనిషిలోనూ రక్తం ప్రవహిస్తోంది. కానీ మనిషి బంధుత్వాలకు విలువనిస్తున్నాడు. మనుషులందరూ ఒక్కటేనని గ్రహించి సామరస్యంతో అందరూ ఒకే బాటపైన నడవాలంటే అందుకొక్కటే మార్గం కనబడుతోంది. చర్మానికి వెనుకనున్న రక్తం ఏదో ఒకరోజున చర్మం ముందుకు వచ్చి వెల్లువెత్తి పారుతుంది. అంతవరకూ సర్వమానవ సమానత్వం ఎవ్వరూ తెలుసుకోలేరు.

ఈ కథ సాయుధ విప్లవాన్ని ప్రోత్సహిస్తుంది.

శచీంద్రుడికి ఆధ్యాత్మిక దృష్టి ఉంది. ఆయనలో ఆవేశం ఉంది. కానీ ఆయన విప్లవ మార్గాల నెన్నడూ ప్రోత్సహించలేదు. ఏదో దారుణమైన సంఘటన జరిగి అదాయన మనసును కదిలించి ఆ ఆవేశంతో శచీంద్రుడీ కథ వ్రాసి ఉండాలి. వ్రాసిన తర్వాత



అది తన మనస్తత్వానికి సరిపడక ప్రచురణకు పంపి ఉండడు.

ఈ కథ దేశంలో చాలా పెద్ద సంచలనం లేపదీసింది.

శచీంద్రుడి నిటువంటి కథకు ప్రోత్సహించిన ఆ సంఘటన ఏమిటి? ఆయన వంటి కవికూడా రక్తపాతంతో కూడిన విప్లవాన్ని కోరే ఆవేశాన్ని పొందుతాడా?

ఈ కథ భారతదేశంలోని అన్ని భాషలలోకీ మాత్రమేకాక-ఆంగ్లంతోపాటు రష్యన్, ఫ్రెంచి, జర్మన్ భాషల్లోకి కూడా అనువదించబడింది. మధ్యమానవ మనస్తత్వాన్ని విప్లవంతో అంత చక్కగా సమన్వయపరచిన వారెవరూలేరని ఎందరో అంతర్జాతీయ ప్రముఖులన్నారు. శచీంద్రుడి బహుముఖప్రజ్ఞ కుదా పరంగా ఈ కథను కొందరు విమర్శించారు. మరికొందరైతే శచీంద్రుడు మరికొంత కాలం బ్రతికి ఉంటే విప్లవ కథలు మాత్రమే వ్రాసి ఉండేవాడన్న నిర్ణయానికి కూడా వచ్చారు.

ఆ విధంగా చాలామంది దృష్టి ఈ కథ పూర్వాపరాలపై ప్రసరించటంతో రాంబాబు పేరు వెలుగులోకి వచ్చింది.

రాంబాబు తండ్రి, శచీంద్రుడి తండ్రి మేనత్త మేనమామల బిడ్డలు. వారిమధ్య రాకపోకలు మరీ అంత ఎక్కువగా లేవు. రాంబాబుకు పదిహేను సంవత్సరాలప్పుడు శచీంద్రుడొక్కసారి వాళ్ళింటికి వచ్చాడు. ఆ రోజున వాళ్ళింట్లోకి పాము వచ్చింది. దాన్ని చంపాలంటే ఇంట్లో అందరికీ భయం. అంతా కలిసి ఇంట్లో పని చేసే పనివాడ్ని గోపిని అందుకు పురిగొల్పారు. తనకూ భయమేనని వాడు అన్నాడు. కానీ అంతకుముందు వాడొక పామును చంపగా చూసిన పెద్దవాళ్ళు అది బురదపామనీ ఇది తాచుపామేమో భయంగా ఉన్నదని వాడన్నాడు. వాడు నిజంగానే భయంతో వణుకుతున్నాడు. చివరికలా కాదని వాడికో కర్ర ఇచ్చి పాము దూరిన గదిలోకి బలవంతంగా తోసి తలుపులు వేసేశారు.

ఆ దృశ్యం చూసి శచీంద్రుడది అన్యాయమని ఘోషించాడు.

"నీకు తెలియదురా- వాడా పామును చంపకపోతే చూడు - అన్నాడు రాంబాబు నాన్న."

"వాడు భయపడుతున్నాడు కదా" - అన్నాడు శచీంద్రుడు.

"అదంతా నటన. ఇంట్లో పాముందంటే మేమందరం భయపడుతూంటే వాడికదో సరదా - అన్నాడు రాంబాబు నాన్న. ఆయన అన్నట్లే సరిగ్గా అయిదు నిముషాలకు గోపీ లోపల్నుంచి గది తలుపులు తట్టాడు. అందరూ తలుపులు తీశారు. అప్పుడు బయటకు వచ్చిన గోపీ చేతిలో కర్ర ఉంది. కర్రకు పాము వ్రేలాడుతోంది. వాడి ముఖంలో విజయగర్వం ఉంది.

"ఏరా - ఇందాకా అంత భయం నటించావు?" అన్నాడు రాంబాబు నాన్న.

"భయపడ్డం మా రక్తంలో లేదండి - " అన్నాడు వాడు.

అప్పుడు శచీంద్రుడు రాంబాబును దగ్గరగా రమ్మని-"వాడి వంట్లో రక్తమే మీ వంట్లోనూ ప్రవహిస్తోంది. మరి మీ అందరి రక్తంలోకి భయం ఎలా వచ్చింది?" అన్నాడు.

దానికి రాంబాబు అప్రయత్నంగా "వాడికీ మాకు పోలికేమిటి? వాడు పనివాడు. మేము యజమానులం!" అన్నాడు.

శచీంద్రుడు రాంబాబును వేరే గదిలోకి పిలిచి - "ఈ రోజు మీ యింట్లో జరిగినది మహాదారుణం. ముందు పామును చంపడానికి గోపీ నిజంగానే భయపడ్డాడు. చివర్లో ఏ దారీ కనిపించక ప్రాణాలకు తెగించి వాడా పామును చంపాడు. అది వాడి అదృష్టం. ఎలాగూ చంపాను కదా అని వాడు గొప్పలు చెప్పాడు తప్పితే నిజానికి వాడా సమయంలో ప్రాణభీతిలో ఉన్నాడు.

రాంబాబుకు నమ్మకం కుదరలేదు.

శచీంద్రుడు వదలకుండా-"అలా పామున్న గదిలోకి కర్రనిచ్చి నిన్ను లోపలకు తోసినా అంతే చేయగలవు. మనిషి జంతువు కన్నా తెలివైనవాడు. ప్రాణంమీదకు వచ్చినపుడు మనిషి తన తెలివిని పూర్తిగా ఉపయోగిస్తాడు-" అన్నాడు.

ఒక గదిలో తను, పాము-అన్న విషయం తల్చుకుని వణికిపోయాడు రాంబాబు. అప్పుడతడు గోపీ మానసికవ్యధ నూహించుకోగలిగాడు.

"గదిలోకి వెళ్ళమని మీ నాన్న నిన్ను శాసించలేదు. తను వెళ్ళలేదు. వాడి అదృష్టానికి వాడిని వదిలి అంతాకలిసి గోపిని లోపలకు తోశారు. తను లోపలకు తోయబడ్డ క్షణంలో గోపీ ప్రాణభీతికి మించి ఏమనుకుని ఉంటాడో తెలుసా?" అన్నాడు శచీంద్రుడు.

రాంబాబు తల అడ్డంగా ఊపాడు.

"ఏదో ఒకరోజున తనూ మిమ్మల్ని అలాగే గదిలోకి తోయాలని......."

రాంబాబు వణికిపోయాడు.

శచీంద్రుడు ఆవేశంగా- "నేను కథ చెబుతాను రాసుకో" - అన్నాడు. ఆయన చెబుతూంటే రాంబాబు రాశాడు. రాసిన కథను శచీంద్రుడొసారి చదివి - "ఇది నీ దగ్గరే భద్రంగా ఉంచు. నేనడిగినప్పుడియ్యి - " అని రాంబాబుకు చెప్పాడు. ఆ తర్వాత



మరో ఆర్నెల్లకు ఆయన గతించాడు.

రక్తం కథకు ఎంతటి ప్రచారం లభించిందో - అంతకు మించి శచీంద్రుడు నా కథ వ్రాయడానికి ప్రోత్సహించిన సంఘటనకు కూడా అంతటి ప్రచారము లభించింది. ఆ విశేషమూ ఎన్నో దేశ, విదేశ భాషలలోకి అనువదించబడింది.

ఈ విశేషాలు తొలిసారిగా ప్రచురించిన పత్రికా సంపాదకుడు ఒకసారి రాంబాబుకు కబురు పెట్టాడు రాంబాబు వెళ్ళాడు.

"నీ వందించిన కథ ద్వారా మా పత్రికకు ప్రాచుర్యం పెరిగింది. ఇందుకు నీకు నేను ప్రత్యుపకారంగా- నీ ఫోటో పత్రికలో వేసి- ప్రత్యేకంగా పరిచయం చేయాలనుకుంటున్నాను-" అన్నాడు సంపాదకుడు.

"అలావద్దు. మీరు నాకు ప్రత్యుపకారం చేయాలనుకుంటే ఇంకో మార్గముంది-" అన్నాడు రాంబాబు.

"ఏమిటది?"

"నా రచనలను ప్రోత్సహించండి-"

"బాగుంటే ఎవరి రచనలనైనా ప్రోత్సహిస్తాను!"

"అయితే మీ పత్రికనుంచి తిరిగివచ్చిన నా యీ రచనలను మరొక్కసారి చూసి అవి బాగున్నాయో లేవో చెప్పండి-" అన్నాను రాంబాబు.

అయిష్టంగా సంపాదకుడా రచనలను అందుకున్నాడు. అవి మొత్తం ఆరున్నాయి. అన్నింటిపైనా తొలిపేజీపై ఇంటూమార్కు, సంపాదకుడి సంతకం ఉన్నాయి. ఏ కథా మూడు నాలుగు పేజీలకు మించిలేదు. అందువల్ల సంపాదకుడు వాటిని అప్పటికప్పుడే చదవడం ప్రారంభించి- ఒకో కథే చదివి- "బాగుంది. కానీ ఇది చదివిన గుర్తేలేదు నాకు-" అంటూ నాలుగు కథలు చదివి పూర్తి చేసి అయిదో కథ దగ్గర చటుక్కున ఆగిపోయాడు.

రక్తం— రచన : రాంబాబు అని ఉన్నది అక్కడ.

"అది మీరు చదివినకథే. ఆ తర్వాత కథా మీరు చదివినదే- శచీంద్రుడిని రక్తం కథకు ప్రోత్సహించిన సంఘటనగా మీకు నేను కల్పించి చెప్పినకథ అది-" అన్నాడు రాంబాబు.

"అంటే?" అన్నాడు సంపాదకుడు.

"సార్- రక్తం నా తొలిరచన. అది ఇంచుమించు అన్ని పత్రికలనుంచీ తిరిగివచ్చింది. ఆ రచన గొప్పదని నాకు అనిపించేంది. అందుకే పాఠకులకు ఆ కథను అందించడానికి శచీంద్రుడి పేరు వాడుకున్నాను. ఆ పేరు దానికి గొప్పతనాన్నాపాదించిందో, ఆ కథలో గొప్పతనముందో మీరే నిర్ణయించాలి. ఆంగ్లంలోకి తర్జుమా చేసుకుంటే తప్ప రవీంద్రుడి గీతాంజలికి భారతదేశంలో గుర్తింపు లభించలేదు. కథలను అంచనావేయగల శక్తి మీకుంది. కానీ మాబోటివారు శచీంద్రుడి వంటి పేర్లను ఆశ్రయించనవసరం లేకుండా ఉండాలంటే- మీ బోటివారు వాటిని శ్రద్ధగా చదవాలి- పత్రికలు పెట్టింది కథకుల్ని ప్రోత్సహించడానికి కాదుసార్. కథల్ని ప్రోత్సహించడానికి! ఈ ఒక్క విషయం మీరు గుర్తుంచుకుంటే చాలు సార్— నాకు ప్రత్యుపకారం చేసినట్లే!" అన్నాడు రాంబాబు.

సంపాదకుడికి అప్పుడు రాంబాబులో ఎందరో రచయితలు కనిపించారు.

✱


శుభాకాంక్షలతో!

భాగ్యలక్ష్మి లారీ సప్లయర్స్

ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్స్ & కమీషన్ ఏజంట్స్

చిరుమామిళ్ళ నాగభూషణం

H.NO: 19-71/2 టి. నాగర్ కొత్తపేట X రోడ్

విజయవాడ హైవే,

హైదరాబాదు - 500035.

PHONE: 559540.